ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

గుంటూరు
జిల్లా వార్తలు
1
శనివారం 2 మార్చి 2024


సభా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కుర్చీలు, బారికేడ్లు


సభ వేదికను పరిశీలిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, గొట్టిపాటి రవికుమార్ తదితరులు

రా కదలిరాకు..
సర్వం సిద్ధం

- నేడు దాచేపల్లిలో బహిరంగ సభ
- సభ విజయవంతానికి నేతల కృషి
- ఎంపీ లావు, మక్కెన టీడీపీలో చేరిక
- దాచేపల్లిలో చంద్రబాబు బసకు ఏర్పాట్లు

పిడుగురాళ్ల, దాచేపల్లి, మార్చి 1: గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లిలో శనివారం జరిగే రా.. కదలిరా సభకు టీడీపీ నాయకులు సర్వం సిద్ధం చేశారు. సాయంత్రం 4 గంటలకు జరిగే బహిరంగ సభలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. దాచేపల్లిలో నార్కెట్‌పల్లి ప్రధాన రహదారి పక్కన రా.. కదలిరా సభకు ఏర్పాట్లు చేశారు. సభను విజయవంతం చేసేందుకు నాయకులు కంకణం కట్టుకున్నారు. ఈ సభకు లక్షమందికి పైగా జనం తరలివస్తారని అంచనా వేసి ఆ స్థాయిలో ఏర్పాట్లు వేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన నేతలు సభకు హాజరుకానున్నారు. భారీగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. సభ ద్వారా టీడీపీ, జనసేన శ్రేణులను చంద్రబాబు ఎన్నికలకు సమాయత్తం చేయనున్నారు. రా.. కదలిరా సభ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చంద్రబాబు సమక్షంలో సభా వేదికపై టీడీపీలో చేరనున్నారు. వారి అనుచరులు, పలువురు వైసీపీ నేతలు, స్థానిక సంస్థల ప్రతినిధులు కూడా టీడీపీ కండువా కప్పుకుంటారని నాయకులు తెలిపారు. అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించిన తర్వాత చంద్రబాబు జిల్లాకు వస్తుండటంతో అధినేత పర్యటనను విజయవంతం చేసేందుకు తెలుగు తమ్ముళ్లు సన్నాహాలు చేశారు. అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా టీడీపీ, జనసేన శ్రేణులు, అభిమానులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే వారికి భోజనం, తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలాలను ఎంపిక చేశారు. సభా ప్రాంగణానికి ఇటు పిడుగురాళ్ల, అటు పొందుగల వైపు పార్కింగ్ స్థలాలు కేటాయించారు. శుక్రవారం అర్ధంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, యరపతినేని శ్రీనివాసరావు తదితరులు సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు.


చురుగ్గా సాగుతున్న హెలిపాడ్ నిర్మాణ పనులు

దాచేపల్లి పసుపుమయం


రా కదలిరా సభతో దాచేపల్లి పసుపుమయమైంది. దాచేపల్లి పట్టణం అంతా ఫ్లెక్సీలు, టీడీపీ, జనసేన జెండాలతో నిండిపోయింది. ప్రధాన రహదారి కూడా పసుపుమయంగా మారింది. హెలిప్యాడ్ నుంచి సభావేదికకు వెళ్లే రహదారికి ఇరువైపులా చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ పెద్దఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం వద్ద సాంస్కృతిక ప్రదర్శనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నేతృత్వంలో ఒక్క గురజాల నియోజకవర్గం నుంచే 60 వేల మందికి పైగా తరలివస్తారని అంచనా. వ్యవధి తక్కువగా ఉన్నప్పటికీ వేదిక, జనసమీకరణకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను యరపతినేని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

లక్ష మందితో సభ : యరపతినేని

దాచేపల్లిలో శనివారం జరిగే రా.. కదలిరా బహిరంగసభకు లక్ష మంది హాజరవుతారని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆత్మగౌరవ యాత్ర స్ఫూర్తితో ఆనాడు టీడీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, ఆ మాదిరిగానే రా.. కదలిరా సభతో వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి టీడీపీ వస్తుందని తెలిపారు. ఐదేళ్లపాటు వైసీపీ పాలనలో టీడీపీ శ్రేణులు పడిన ఇబ్బందులు, అవమానాలను కసిగా మార్చుకుని నేడు చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా తరలిరానున్నారన్నారు.

దాచేపల్లిలోనే చంద్రబాబు బస

సభ అనంతరం చంద్రబాబు దాచేపల్లిలోనే
రాత్రి బస చేస్తారు. ఇందుకు సంబంధించిన
ఏర్పాట్లు చేశారు. తొలుత అనుకున్న విధంగా
మధ్యాహ్నం 2 గంటలకు కాకుండా సాయం
త్రం 4 గంటలకు సభ ప్రారంభం కానున్నది.
దీంతో సభ పూర్తయ్యే సరికి రాత్రి అవుతుంది.
ఆ సమయంలో హెలికాఫ్టర్‌లో చంద్రబాబు
వెళ్లే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో ఆయన
ప్రత్యేక బస్సులో రాత్రి బస చేసి ఆదివారం
ఉదయం వెళ్లేలా కార్యక్రమం రూపొందించారు.
అందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివా
రం ఉదయం 10 గంటలలోపు చంద్రబాబు
తిరిగి హెలికాప్టర్ ద్వారా వెళ్లనున్నారు. ఈ
క్రమంలో ఎన్నికలపై ఆయన ఆదివారం
ఉదయం ఉమ్మడి గుంటూరు నేతలతో చర్చిం
చే అకాశం ఉంది.


ముస్తాబవుతున్న సభా వేదిక

హైవేపై ఘోరం.. ముగ్గురు మృతి

- డ్రైవర్ సహా మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- క్షతగాత్రులందరూ ఒకే కుటుంబీకులు.. మంగళగిరిలో విషాదం
- జూలకల్లులో బంధువుల శుభకార్యానికి వెళ్లి వస్తుండగా దుర్ఘటన


గార్లపాటి సుబ్బమ్మ


గార్లపాటి శ్యామ్ దీక్షిత్


గార్లపాటి పావని

గుంటూరు, మంగళగిరి సిటీ, మార్చి 1: వివాహ వేడుకకు వెళ్లి వస్తుండగా గుంటూరు శివారు జాతీయ రహదారిపై బొంతపాడు సమీపంలో గురువారం అర్ధరాత్రి (శుక్రవారం తెల్లవారు జామున) దాటిన తర్వాత జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు సంబంధించి పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలు.. మంగళగిరిలోని గండాలయ్యపేటకు చెందిన స్వర్ణకారవృత్తిదారుడైన గార్లపాటి రామకృష్ణ కుటుంబసభ్యులు పిడుగురాళ్ల మండల పరిధిలోని జూలకల్లులో బంధువుల వివాహానికి వెళ్లారు. రామకృష్ణ తనకు తెలిసిన వారి వద్ద కారు తీసుకుని మంగళగిరికి చెందిన ఏకుల శ్రీకాంత్‌ను డ్రైవర్‌గా తీసుకెళ్లారు. కారులో రామకృష్ణ తల్లి సుబ్బమ్మ (48), ఆమె తోడికోడళ్లు నాగలక్ష్మి, రాధా, నాగలక్ష్మి కూతురు పావని (17), రామకృష్ణ కుమారుడు శ్యాం బాబు(8), డ్రైవరు శ్రీకాంత్ మొత్తం ఆరుగురు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు పెళ్లికి వెళ్లారు. వివాహం అనంతరం రాత్రి 10 గంటల సమయంలో వారు అదే కారులో గుంటూరు మీదగా మంగళగిరి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు గుంటూరు సమీపంలోని నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై అర్ధరాత్రి సమయంలో బొంతపాడు అడ్డరోడ్డు వద్దకు వచ్చే సరికి ముందు కంకర లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కును కుడివైపున వెనుక నుంచి అతివేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఎడమ వైపు కూర్చొన్న సుబ్బమ్మ, పావని, శ్యాంబాబు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఆ సమయంలో రాత్రి గస్తీలో ఉన్న ప్రత్తిపాడు సీఐ నిసార్‌బాష, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో జీజీహెచ్‌కు తరలించారు. నాగలక్ష్మి, డ్రైవర్ శ్రీకాంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రాధ భర్త శ్రీను జీజీహెచ్‌కు చేరుకున్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణంతో శుక్రవారం జీజీహెచ్ మార్చురీ వద్దకు మంగళగిరికి చెందిన మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను శుక్రవారం మధ్యాహ్నం మంగళగిరి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో మంగళగిరి గండాలయపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

లోకేశ్ దిగ్భ్రాంతి..

రోడ్డు ప్రమాదంలో మంగళగిరికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, నేతలు జగ్గారపు రామమోహనరావు, నల్లగొర్ల రామకృష్ణ, బాపనపల్లి వాసు తదితరులు మృతదేహాలకు నివాళులు అర్పించి, బాధిత కుటుంబాలను ఓదార్చారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

తొలిరోజు హాజరు..
97.90 శాతం

- ప్రశాంతంగా జూనియర్ ఇంటర్ పరీక్షలు
- కేంద్రాల్ని తనిఖీ చేసిన కలెక్టర్ వేణుగోపాలరెడ్డి
- జిల్లావ్యాప్తంగా 16 కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీలు

గుంటూరు (విద్య), మార్చి 1: జిల్లాలో జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సంస్కృతం, తెలుగు పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జిల్లాలోని 92 కేంద్రాల్లో 97.90 శాతం హాజరు నమోదైంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 32,498 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 31,718 మంది హాజరయ్యారని ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో జుబేర్ తెలిపారు. తొలిరోజు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మొత్తం 16 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. అయితే ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీసు, కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు. ఇదిలా ఉంటే ఇంటర్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తనిఖీ చేశారు. ఉదయం 11 గంటల సమయంలో గుంటూరు నగరంలోని ఏసీ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ ఏర్పాట్లు గురించి ప్రిన్సిపాల్ మోజేస్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కెమెరాల నుంచి ఇక్కడ ఎలా మానిటంగ్ చేస్తున్నారు? అనే విషయాలు ఆర్‌ఐవోను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా ఇంటర్ బోర్డు సహాయకుల్ని ఏర్పాటు చేసింది. వారితో పరీక్షలు రాసేందుకు దివ్యాంగులు కేంద్రాలకు వెళ్లడం కనిపించింది.


ఇంటర్ బోర్డు కార్యాలయంలో మోనిటర్ ద్వారా సిసి కెమెరాల్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి


తనిఖీల తరువాతే కేంద్రాల్లోకి అనుమతి.... (ఏసీ కళాశాల వద్ద)


బోర్డులో నంబర్లుసరి చూసుకుంటున్న విద్యార్థులు

7న
దోనేపూడికి చంద్రబాబు

- తిరుపతమ్మ ఆలయం ఎదుట ప్రజాగళం సభ
- స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి ఆనందబాబు


చంద్రబాబు బహిరంగ సభ జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

కొల్లూరు, మార్చి 1: టీడీపీ అధినేత చంద్రబాబు రా.. కదలిరా సభలు ఈ నెల 4న అనంతపురం జిల్లా రాప్తాడులో ముగుస్తాయి. ఆ తర్వాత ప్రజాగళం పేరుతో బహిరంగ సభలను టీడీపీ రూపొందించింది. ఐదు రోజుల పాటు ఈ బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 7న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వేమూరు, బాపట్ల, రేపల్లె నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటిస్తారని పార్టీ నాయకులు తెలిపారు. కొల్లూరు మండలం దోనేపూడి గ్రామంలో ప్రజాగళం బహిరంగసభను ఏర్పాటుచేశారు. శుక్రవారం మాజీ మంత్రి, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు దోనేపూడిలో నిర్వహించే ప్రజాగళం బహిరంగ సభకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయం ఎదుట ఉన్న ఏడెకరాల ఖాళీ స్థలం సభకు అనువుగా ఉంటుందని ఎంపికచేశారు. సభా వేదిక, కార్యకర్తల కోసం భోజనం, పార్కింగ్ ఏర్పాట్లకు ఈ ప్రాంతం అనువుగా ఉంటుందని నాయకులు ఆనందబాబుకు వివరించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా బహిరంగ సభ నిర్వహించుకోవచ్చని తేల్చారు. హెలిప్యాడ్, సభా వేదిక పరిశీలన కోసం ఆదివారం టీడీపీ బృందం పర్యటిస్తుందని, వారి సూచనలకు అనుగుణంగా ఖరారు చేస్తామని ఆనందబాబు తెలిపారు. దోనేపూడి గ్రామంలో జరిగే ప్రజాగళం బహిరంగ సభకు 7న ఉదయం 11 గంటలకు చంద్రబాబు చేరుకుంటారన్నారు. అనంతరం చంద్రబాబు అదే రోజున రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో జరిగే సభల్లో పాల్గొంటారన్నారు. ఆయా సభల్లో టీడీపీ, జనసేన నాయకులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, నాయకులు వెనిగళ్ల మహేష్, నిమ్మగడ్డ అనీల్‌బాబు, సుంకర రామమోహనబాబు, గుమ్మడి సాంబశివరావు, బుర్రి జగన్, మున్నంగి విజయ్‌కుమార్, పెదపూడి నాగరాజు, వేములపల్లి మోహనకృష్ణ, సుంకర శ్రీను, ధూళిపూడి కృష్ణ, యడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

- ఎన్నికల శిక్షణలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాలను ఎట్టి పరిస్థితుల్లోను ఉల్లంఘించకూడదని, ఎవరికి కేటాయించిన విధులను వారు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కమిటీ, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్, మీడియా బ్రీఫింగ్, ఎక్స్పెండిచర్ మానిటరింగ్, సి-విజిల్, 1950 కాల్ సెంటర్, కంప్లయింట్ సెల్, కంట్రోల్ రూమ్ కమిటీలలో విధులు కేటాయించిన నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు, సపోర్టింగ్ స్టాఫ్‌కు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో రిటర్నింగ్ ఆఫీసర్లకు ఎక్కువగా పని ఉంటుందని, ఎవరికి ఏ బాధ్యత అప్పగిస్తామో ఆ అధికారి ఆ బాధ్యతను ముందుగా అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కమిటీ (ఎంసీసీ), ఎన్నికల ఖర్చు పర్యవేక్షణ కమిటీలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులోకి వస్తుందన్నారు. అందుకే ముందుగానే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షల వరకు, శాసన సభకు పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో ఆయా కమిటీలు ఎన్నికల అభ్యర్థుల ఖర్చుల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, స్వాతి, రవీంద్రరావు, ఆర్డీవో శ్రీఖర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

ఏసీబీ వలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత



పట్టుబడిన ఏఈ శివరామకృష్ణ, స్వాధీనం చేసుకున్న నగదు

గుంటూరు, మార్చి 1: ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.లక్షా 68 వేల లంచం తీసుకుంటుండగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పటేళ్ళ శివరామకృష్ణను అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరులోని జిల్లా పరిషత్ కాంపౌండ్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వెలుపల ఉన్న టీ స్టాల్ వద్ద శ్యామల రవికిశోర్‌రెడ్డి నుంచి ఏఈ శివరామకృష్ణ లక్షా అరవై ఎనిమిది వేల నగదు తీసుకుంటుండగా గుంటూరు రేంజి ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నల్లపాడుకు చెందిన కాంట్రాక్టర్ శ్యామల రవికిషోర్‌రెడ్డి పెదకాకానిలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ (చెరువు)కు ఎంపీ నిధులతో ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టారు. దీనికి సంబంధించి రూ.42 లక్షల పనులు పూర్తి చేశారు. ఆయా పనులకు సంబంధించిన బిల్లులను ఆమోదించి ఉన్నతాధికారులకు పంపేందుకు గాను పెదకాకాని ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ పటేళ్ళ శివరామకృష్ణ నాలుగు శాతం కమిషన్ అంటే లక్షా 68 వేల రూపాయలు డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని కాంట్రాక్టర్ శ్యామల రవికిషోర్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు శుక్రవారం సాయంత్రం జిల్లా పరిషత్ కాంపౌండ్‌లో గల ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వెలుపల ఉన్న టీ స్టాల్ వద్ద రవికిషోర్‌రెడ్డి నుంచి శివరామకృష్ణ రూ.1.68 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అదనపు ఎస్పీ మత్తే మహేంద్ర ఆధ్వర్యంలో డీఎస్పీలు టీవీవీ ప్రతాప్ కుమార్, ఎన్ సత్యానందం, సీఐలు రవిబాబు, నాగరాజు, అంజిబాబు, సురేష్‌బాబు, నరసింహారెడ్డి ఎస్ఐ మూర్తి సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏఈ శివరామకృష్ణ స్వగ్రామమైన పెదపలకలూరులోని ఆయన ఇంటిలోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ మేరకు శివరామకృష్ణను అరెస్టు చేసి శనివారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు అదనపు ఎస్పీ మహేంద్ర తెలిపారు.

తాడేపల్లి ప్యాలెస్‌ను వణికిస్తున్న లోకేశ్

- మంగళగిరి తెరపైకి వైసీపీ అభ్యర్థిగా రోజుకొకరు... ● తాజాగా మురుగుడు లావణ్య నియామకం



మురుగుడు లావణ్య

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే మంగళగిరి నియోజకవర్గంలో విచిత్రమైన రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన యువనేత నారా లోకేశ్ దూకుడును చూసి తాడేపల్లి ప్యాలెస్‌లోని పెద్దలు వణికిపోతున్నారు. మిగతా నియోజకవర్గాల్లో గెలుపు ఒక ఎత్తు కాగా ఈ నియోజకవర్గంలో గెలుపు అత్యంత కీలకం కావటంతో వైసీపీ ముఖ్య నేతలంతా మంగళగిరిపైనే దృష్టి సారించారు. గత ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ లోకేశ్ నియోజకవర్గాన్ని వీడకుండా తిరిగి అక్కడే విజయఢంకా మోగించాలని గత ఐదేళ్ళుగా అక్కడ బలమైన పునాదులు వేసుకోవడం జరిగింది. ఒక రకంగా ఆ నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంలో ఓ సభ్యుడిగా లోకేశ్ కలిసి పోయారు. ఏ ఇంట అవసరం వచ్చినా...ఆపద వచ్చినా... నేనున్నానంటూ వారికి ఆర్థికంగా అండగా నిలిచి గెలుపునకు బాటలు వేసుకుంటూ వచ్చారు. వరుసగా రెండు పర్యాయాలు అదే నియోజకవర్గం నుంచి గెలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డిపై తీవ్ర వ్యతిరేకత నెలకొనడంతో గెలుపు అవకాశాలు ఏమాత్రం లేవని భావించి రెండు నెలల క్రితం అతన్ని బరిలో నుంచి తప్పించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఉండగానే గంజి చిరంజీవిని తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించి బరిలోకి దించారు. బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి చిరంజీవి కావడంతో ఆళ్ల కంటే బలమైన అభ్యర్థిగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. చిరంజీవి గతంలో టీడీపీ తరపున మంగళగిరి నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. చిరంజీవిని తెరపైకి తెచ్చిన కొద్ది రోజులకే తాము తీసుకున్న నిర్ణయం తప్పనే భావనకు సీఎం జగన్ వచ్చారు. చిరంజీవి సామాజికవర్గానికే చెందిన మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు, అతని వియ్యంకురాలు మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల అతనికి సహాయ నిరాకరణ చేయటం జరిగింది. వీరి సహకారం లేకపోతే చిరంజీవి గెలవటం అసాధ్యమనే భావనకు వచ్చిన సీఎం జగన్ అతనికి కూడా గుడ్‌బై చెప్పాలనే నిర్ణయానికి వచ్చారు. అయితే అతనికి బదులుగా కాండ్రు కమలకు అవకాశం కల్పిస్తారని కొద్ది రోజులుగా ప్రచారం జరిగింది. అయితే ఆమెకు కాకుండా ఆమె కుమార్తె లావణ్యకు అవకాశం కల్పించేందుకు సన్నద్ధమయ్యారు. శుక్రవారం ఆళ్ల, చిరంజీవి, మురుగుడు హనుమంతరావు, కాండ్రు కమల తదితరులను సీఎం జగన్ తన వద్దకు పిలిపించుకొని మురుగుడు లావణ్య పేరును ప్రకటించారు. దీంతో ఆ నియోజకవర్గంలోని వైసీపీ శ్రేణుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డిని తప్పించటం ఇష్టంలేని ఓ వర్గం అసంతృప్తితో రగులుతున్నది. ఆయన అభిమానులు కొంత మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అదే విధంగా చిరంజీవికి టికెట్ ఇస్తున్నామనే ఆశపెట్టి మూడునాళ్ళ ముచ్చటగా మురిపించి పక్కకు నెట్టటంపై కూడా ఆయన అనుయాయులు ఆగ్రహిస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో మురుగుడు హనుమంతరావు ఇదే నియోజకవర్గం నుంచి గెలుపొంది మంత్రిగా కూడా పనిచేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. అంతేగాకుండా ఆయన ఎమ్మెల్సీ పదవిని కూడా చేజిక్కించుకొని ఆ పదవిలో కొనసాగుతున్నారు. అదే విధంగా అతని వియ్యంకురాలు కాండ్రు కమల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కించుకొని విజయం సాధించిన విషయం ప్రస్తావిస్తున్నారు. తాజాగా అదే కుటుంబానికి చెందిన మురుగుడు లావణ్యకు అవకాశంకల్పించటంపై మండిపడుతున్నారు.



సామినిబాయి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బ్రహ్మారెడ్డి

నీళ్లడిగితే ట్రాక్టర్‌తో ఢీకొట్టి ప్రాణాలు తీస్తారా?

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల, మార్చి 1: మానవత్వం మంటగలిసిందా అన్నట్లు రెంటచింతల మండలం మల్లవరంలో జరిగిన ఘటన ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం మల్లవరానికి చెందిన సామినిబాయి మృతదేహం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా బ్రహ్మారెడ్డి అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని సందర్శించి విలేకరులతో మాట్లాడారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సామినిబాయి గ్రామంలో బిందెడు నీరు పట్టుకునేందుకు రాగా.. మీరు మా పార్టీ కాదు.. నీరెందుకు పట్టుకుంటావంటూ వైసీపీ నేత ట్రాక్టర్‌తో ఢీకొట్టడమే కాకుండా ఆమెపై నుంచి రెండు మూడు సార్లు ట్రాక్టర్‌ను ముందుకు, వెనక్కు పోనిచ్చి హత్య చేశారన్నారు. నాలుగుసార్లు శాసనసభ్యునిగా గెలిపిస్తే నియోజకవర్గంలో నీరు లేని దుస్థితి ఉందన్నారు. దుర్మార్గపు సైకో రామకృష్ణారెడ్డి ఆధ్వర్యాన గ్రామగ్రామాన రెచ్చకొట్టడం.. దాడి చేయడం.. పోలీసులు వారికి సాయం అందించడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఇటీవల పట్టణంలోని జెండాచెట్టు వద్ద కూడా వైసీపీ నేతలు దాడులు చేసి టీడీపీ వారిపై 307 కేసులు పెట్టారన్నారు. వైసీపీ వేధింపులు తాళలేక దుర్గారావు అనే వ్యక్తి బలయితే అతని మరణాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించారన్నారు. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అంటున్నారని.. సామాజిక న్యాయమంటే అన్ని సామాజిక వర్గాలను హింసించడమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్ధం అంటూ ఊదరగొడుతున్నారని.. ప్రజల ప్రాణాలు తీసేందుకా సిద్ధం అంటూ ప్రశ్నించారు. సామినిబాయి ప్రాణాలను డబ్బుతో వెలగట్టే ప్రయత్నం చేస్తున్నారని, యాక్సిడెంట్‌గా చిత్రీకరించేందుకు చూస్తున్నారని అన్నారు. ఈ కేసులో పోలీసులు సరైన న్యాయం చేయకుంటే ఎస్సీ, ఎస్టీ సంఘాలతో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. జగన్ స్థానిక ఎమ్మెల్యే పీఆర్కే వంటి అరాచక శక్తులను పెంచి పోషిస్తున్నారన్నారు. ఈ అరాచక పాలనకు ప్రజలు సమాధానం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. బ్రహ్మారెడ్డి వెంట కుర్రి శివారెడ్డి, పంగులూరి పుల్లయ్య, పేరువాల పుల్లారావు, గుండాల శ్రీనివాస్ యాదవ్, పసుపులేటి బ్రహ్మనాయుడు, సాతులూరి కుమార్, కొమెర దుర్గారావు, నేరేటి వీరాస్వామి యాదవ్, రాజబోయిన మధు, సుమత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై ఫోక్సో కేసు నమోదు

క్రోసూరు, మార్చి 1: బాలికపై అత్యాచారం చేసిన బాలుడిపై ఫోక్సో కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 24న 14 ఏళ్ల కుమార్తె కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేయగా ఆమెను 17 ఏళ్ల బాలుడు తీసుకువెళ్లి అత్యాచారం చేసినట్లు తేలింది. శుక్రవారం ఫోక్సో కేసుగా కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి పంపినట్లు తెలిపారు. క్రోసూరు ఎస్ఐ మహబూబ్ బాషా నమోదు చేయగా ఫోక్సో కేసును సత్తెనపల్లి డీఎస్పీ జీ గురునాథ బాబు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చైతన్య గోదావరి బ్యాంక్‌కు అవార్డు

గుంటూరు, మార్చి 1: ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడం కోసం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (సీజీజీబీ) స్థిరమైన ప్రయత్నాలకు గుర్తింపుగా చాంబర్ ఆఫ్ ఇండియన్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఉత్తమ ఆర్ఆర్‌బీ అవార్డును అందించింది. న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మక ఎంఎస్ఎంఈ బ్యాంకింగ్, ఎంఎస్ఈఎఫ్‌సీ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023 కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డును సీజీజీబీ జనరల్ మేనేజర్ పి మారుతీరామ్, సీనియర్ మేనేజర్ క్రెడిట్ వీఎస్ పవన్‌కుమార్ అందుకున్నారు. ఎంఎస్ఎంఈ మంత్రి నారాయణ్ రాణే, సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి దీపక్ వర్మల సమక్షంలో ఈ అవార్డులను అందజేశారు. చైర్మన్ టి కామేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డును ఎంఎస్ఎంఈ రంగాన్ని ప్రోత్సహించడంలో అచంచలమైన అంకితభావం, పట్టుదల కలిగిన సీజీజీబీ ఉద్యోగులకు అంకితం చేశారు. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) రంగాన్ని పునరుజ్జీవింపచేయడానికి భారత ప్రభుత్వం చేస్తున్న సమష్టి ప్రయత్నాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) అమూల్యమైన సహాయాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎంఎస్ఎంఈల క్రెడిట్ అవసరాలను తీర్చడానికి సీజీజీబీ రూ. 288.86 కోట్ల రుణాలను ఇచ్చి తద్వారా రంగం పునరుద్ధరణకు గణనీయంగా తోడ్పడిందన్నారు.



అవార్డు అందుకుంటున్న సీజీజీబీ జనరల్ మేనేజర్ మారుతీరామ్, సీనియర్ మేనేజర్ వీఎస్ పవన్‌కుమార్

ముగ్గురు వ్యవసాయశాఖ ఉద్యోగులపై వేటు

నరసరావుపేట, మార్చి 1: జిల్లాలో వ్యవసాయ శాఖ పరిధిలోని ముగ్గురు ఉద్యోగులపై వేటు పడింది. ఎరువులు విక్రయించిన సొమ్మును సొంతానికి వాడుకోవడంపై కలెక్టర్ శివశంకర్ చర్యలు తీసుకున్నారు. ఇద్దరు వీఏఏలు, ఓ ఎంపీఈవోను సస్పెండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీ విత్తనాలను గురజాల మండలం చర్లగుడిపాడు వీఏఏ వి.వెంకయ్య రూ.4,83,000, పిడుగురాళ్ల మండలం వీరాపురం ఎంపీఈవో పులిచెర్ల వెంకటేష్ రూ.3,26,575 సొంతానికి వినియోగించుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఎరువుల విక్రయానికి సంబంధించి కారంపూడి మండలం ఒప్పిచర్ల వీఏఏ కేవీ శ్రీనివాసరావు రూ.3,24,753 వ్యక్తిగతంగా వినియోగించుకున్నాడు. శ్రీనివాసరావు దగ్గర సదరు సొమ్మును అధికారులు రికవరీ చేశారు. అయితే పై ఇరువురు ఉద్యోగులు రూ.8,09,575 తిరిగి చెల్లించలేదు. ఎరువులు, సబ్సిడీ విత్తనాల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడటంతో కలెక్టర్ వారిని సస్పెండ్ చేశారు.

కుడికాలువకు నీటి విడుదల

విజయపురిసౌత్, మార్చి 1: తాగునీటి అవసరాల నిమిత్తం కృష్ణా నది యాజమాన్య బోర్డు పర్యవేక్షణలో శుక్రవారం నాగార్జున సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేశారు. 5, 7 గేట్ల ద్వారా ఉదయం 10:30 గంటలకు గేటుకు వెయ్యి క్యూసెక్కుల చొప్పున 2 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గంటకు 2 వేల క్యూసెక్కులను పెంచుతూ మధ్యాహ్నానికి 6 వేల క్యూసెక్కులను విడుదల చేశారు. 9 రోజులపాటు నీటి విడుదల కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఈఈ శ్రీహరి, డీఈ మురళీధర్, జేఈలు బాబుమియా, సుధ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

అమరావతి, మార్చి 1: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అమరేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 5 నుంచి 14 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. తొలిరోజున అమరేశ్వరస్వామిని పెండ్లి కుమారుడిగా చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 8న మహాశివరాత్రి రోజున తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం లింగోద్భవ కాలంలో మహన్యాస రుద్రాభిషేకాలు అనంతరం స్వామివార్ల కల్యాణం జరుగుతుంది.

ఎన్నికల వేళ జగన్‌కు ఓటమి భయం

- కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 1: ఎన్నికలు 50 రోజులు ఉండగానే సీఎం వైఎస్ జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా తాను ఏం చేశాడో ప్రజలకు చెప్పుకోలేక వ్యవస్థలను అడ్డం పెట్టుకొని టీడీపీ, జనసేన నాయకులను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారన్నారు. పలు శాఖల ఉద్యోగులు జగన్ దగ్గర ప్రైవేట్ సైన్యంలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. పుల్లారావు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. పుల్లారావు కుమారుడికి ఏం జరిగినా జగన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయం సాధించటం ఖాయమన్నారు. ప్రజల కోసమే టీడీపీ, జనసేన పొత్తు అన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ నేతలను అక్రమ అరెస్టులతో బెదిరిస్తే భయపడేది లేదన్నారు. ఈనెల 2వ తేదీన దాచేపల్లిలో జరిగిన చంద్రబాబు నాయుడు రా కదలిరా బహిరంగ సభకు నియోజక వర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కన్నా నాయకత్వంలో అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర నాయకులు చౌట శ్రీనివాసరావు, బత్తుల వెంకటస్వామి, నాయకులు ఆళ్ళ అమరేశ్వరరావు, మారెళ్ళ మల్లేశ్వరరావు, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.



బిల్డ్ అమరావతి అంటూ మందడం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

అధికార మదంతోనే రాజధానిపై అక్కసు

- 1536వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి1: అధికార మదంతోనే సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశాడని 33వేల ఎకరాలు రాజధాని కోసం ఇచ్చిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి చేయాలని అమరావతి రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1536వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ రైతులను అన్నికాలుగా ఇబ్బంది పెడుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని శాశ్వతంగా ఇంట్లో కూర్చోబెట్టటానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన రాజధానిని మార్చుతామనటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వెంటనే జగన్‌రెడ్డి మూడు ముక్కల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర హైకోర్టు అమరావతిని అభివృద్ధి కొనసాగించమని చెపితే పెడచెవిన పెట్టారన్నారు. అందుకు తగిన మూల్యం ఎప్పటికైనా సీఎం జగన్‌రెడ్డికి తప్పదన్నారు. న్యాయస్థానంలోనూ, ప్రజాక్షేత్రంలోనూ రైతులకు తప్పక న్యాయం జరుగుతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ రైతులు దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

7న గుంటూరులో కాంగ్రెస్ బహిరంగసభ

- షర్మిలతో పాటు తెలంగాణ సీఎం రేవంత్ రాక

గుంటూరు, మార్చి 1: రానున్న ఎన్నికల నేపథ్యంలో గుంటూరులో బహిరంగ సభకు కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈనెల 7వ తేదీన గుంటూరులో పెద్ద ఎత్తున సభను నిర్వహించనున్నారు. సభకు ఏపీసీసీ అధ్యక్షుడు వైఎస్ షర్మిలతో పాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక నుంచి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇతర ఏఐసీసీ నుంచి అగ్రనేతలు హాజరుకానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు తెలిపారు. ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, ఆ పార్టీ నేతలు లింగంశెట్టి ఈశ్వరరావు, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి ఇతర నాయకులు స్థలాన్వేషణ చేస్తున్నారు. మంగళగిరి రోడ్డు, పొన్నూరు రోడ్డు ప్రాంతాల్లో స్థలాన్వేషణ చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

రోడ్డు ప్రమాద బాధితులకు పెమ్మసాని పరామర్శ

● మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ పెమ్మసాని

గుంటూరు (మెడికల్) మార్చి 1: బొంతపాడు దగ్గర ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో గాయపడి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీడీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన గార్లపాటి.సుబ్బమ్మ (50), గార్లపాటి శ్యామ్ (6), గార్లపాటి పావని (18) మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన గార్లపాటి నాగలక్ష్మి, ఏకుల శ్రీకాంత్‌లు జీజీహెచ్ ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక టీడీపీ నేతలతో కలసి బాధితులను పరామర్శించి, క్షతగాత్రులకు రూ.25వేలు, మృతుల కుటుంబాలకు రూ.50 వేలు వంతున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ నసీర్ అహ్మద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, పఠాన్ అహ్మతుల్లా, రాయపాటి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య ప్రముఖులతో మొహమ్మద్ నసీర్

ఆర్యవైశ్యులకు అన్నదమ్ముడిగా అండగా ఉంటా

● టీడీపీ గుంటూరు తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

గుంటూరు,మార్చి1(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు అన్నదమ్ముడిలా అండగా వుంటానని టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ చెప్పారు. టీడీపీ గుంటూరు తూర్పు కార్యాలయంలో శుక్రవారం ఆయన పలువురు ఆర్యవైశ్య పెద్దలతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని వర్గాల వారు కలిసి కట్టుగా పని చేసి టీడీపీ- జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా కమీషన్లు వసూళ్లు, ఆలయ భూముల కబ్జాలతో దౌర్జన్యాలకు దిగుతున్నాడన్నారు. తాను మాత్రం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్యవైశ్యులకు అన్నదమ్ముడిలా సహాయపడతానన్నారు. కార్యక్రమం కొనకళ్ల సత్యం, ఈరంటి వర ప్రసాద్, కొత్త మల్లికార్జునరావు, వెంకటేశ్వరావు, లోకేశ్వరావు, బద్రి, శ్రీనివాస్‌రావు, కన్నా, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డేగల ప్రభాకర్, నగర కమిటీ

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్

గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమీపిస్తున్న వేళ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కార్యకర్తా అన్నివిధాలా సంసిద్ధం కావాలని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ సూచించారు. పార్టీ అర్బన్ కార్యాలయం లో శుక్రవారం నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అధికారం కోసం వైసీపీ అనేక అడ్డదారులు తొక్కుందని, వాటని సమర్థవంతంగా ఎదుర్కోవాలని టీడీపీ శ్రేణులకు సూచించారు. బూత్ ఇన్‌చార్జులు ఓటర్ లిస్టుమీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్‌లిస్టులో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలపై ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకునేలా కృషి చేయాలన్నారు. అర్బన్ కమిటీ నేతలు నిరంతరం ప్రజలో మమేకమై జగన్‌రెడ్డి అరాచకాలను, చంద్రన్న చేసిన అభివృద్ధిని తెలియజేయాలన్నారు. సమావేశంలో ముత్తినేని రాజేష్, సోపాటి రత్నం, కామేపల్లి సురేష్, కొల్లి అనిల్, పొన్నెగంటి శ్రీనివాసరావు, క్రోసూరి సతీష్, యద్దల రమేష్, అన్నాల దాస్ నాగరాజు, నిశంకరరావు అమర్నాథ్, ఓర్సు శ్రీనివాసరావు, పెరవలి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సభతో వైసీపీకి చరమగీతం

● టీడీపీ గుంటూరు పశ్చిమ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య



గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం సభ వైసీపీ పాలనకు చరమగీతం పాడిందని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ-జనసేన పొత్తుతో వైసీపీ నేతలకు నిద్ర పట్టడంలేదన్నారు. సభను విజయవంతం కాకుండా అడ్డుకునేందుకు వైసీపీ సర్కార్ ఆర్టీసీ బస్సులు ఇవ్వకుండా, ప్రైవేటు బస్సులను రానీయకుండా, సొంత వాహనాల్లో వెళ్లకుండా ప్రజల్ని అడ్డుకున్నదన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు లక్షలాదిగా గూడెం సభకు వచ్చి టీడీపీ- జనసేన పార్టీలను ఆశీర్వదించారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన అధికారంలోకి వస్తుందని చెప్పడానికి గూడెం సభే నిదర్శనమన్నారు. వైసీపీ అరాచకాలకు గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలందరూ మాకొద్దు ఈ జగన్ అంటున్నారన్నారు. టీడీపీ- జనసేన పొత్తు సూపర్ హిట్ అని, ఇక జగన్ సినిమా అయిపోయిందని ప్రజలే అంటున్నారని డాక్టర్ నిమ్మల అన్నారు.

ముమ్మరంగా ఎన్నికల శిక్షణ కార్యక్రమాలు

● రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా వీసీలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి వెల్లడి



సీఈవో మీనా నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం అవసరమైన ప్రత్యేక బృందాలు, నోడల్ అధికారులను నియమించి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఈవో మీనా ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లు, ఓటరు దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతలో భాగంగా బీఎల్వోలకు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, వీవీటీ, అకౌంటింగ్ టీం, అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అధికారులకు, ఎంసీఎంసీ సంబంధించిన అధికారులకు శిక్షణను నిర్దేశిత సమయంలో పూర్తిచేయటం జరుగుతుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, జిల్లా ఎస్పీని సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా కంట్రోల్ రూం, కంప్లెయింట్ మేనేజ్మెంట్, రిపోర్టింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్, సోషల్ మీడియా సెల్ ఏర్పాటు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు నోడల్ అధికారులను నియమించామన్నారు. ఓటరు జాబితాపై మీడియాలో వచ్చిన కథనాలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు విచారించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి, రాజకీయపార్టీల ప్రతినిధులకు అందిస్తున్నామన్నారు. ఓటరుజాబితాకు సంబంధించి ఫారం-6,7,8 దరఖాస్తులను పెండింగ్ లేకుండా క్షేత్ర స్థాయిలో సక్రమంగా విచారించి ఈఆర్వోలు పరిష్కరించేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ముద్రణ జరిగి వచ్చిన ఎపిక్ కార్డులను పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఎప్పటికప్పుడు పంపిణీ చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల పనులు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. సమావేశంలో నగరపాలకసంస్థ కమిషనర్ కీర్తిచేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పీ.రోజా, ఆర్డీవో శ్రీఖర్, జీఎంసీ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, కలక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ శిరీష, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను పక్కదారి పట్టించడంలో జగన్ దిట్ట

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

గుంటూరు, మార్చి1(ఆంధ్రజ్యోతి): ప్రజలను పక్కదారి పట్టించడం, వారి దృష్టిని మరల్చే విద్యలో జగన్‌ది అందె వేసిన చెయ్యని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 'జనం' సభ దిగ్విజయం కావడంతో ఏం చేయాలో దిక్కుతోచని జగన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీశారని ఆరోపించారు. అందులో భాగంగానే మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ అక్రమ అరెస్టు ఆ కుట్రలో భాగమేనన్నారు. ప్రత్తిపాటి పుల్లారావును చిలకలూరిపేట అభ్యర్థిగా ప్రకటించడంతో, రాజకీయంగా ఆయనను ఎదుర్కోలేక సైకో జగన్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను వేధించడం మొదలుపెట్టారన్నారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజామాస్టారు మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనేకమందిని అక్రమంగా అరెస్టు చేసి రికార్డు సృష్టించారన్నారు. కార్యక్రమంలో శివరామయ్య, రామారావు, దామచర్ల శ్రీనివాసరావు, రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పెమ్మసానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గుంటూరు జిల్లా పారిశ్రామిక వేత్తలు

ఒక్క ఏడాదిలో సమస్యలన్నీ పరిష్కరిస్తా

● టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఒక్క ఏడాది సమయమిస్తే పార్లమెంటులో సమస్యలన్నింటికీ పరిష్కారంచేస్తానని టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఆయన ప్రైవేటు టీచర్ల అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇక్కడ ముప్పై ఏళ్లపాటూ ఉండడానికి సిద్ధమయ్యే వచ్చానని, పార్లమెంటులోని సమస్యలన్నీ ఒక్క వెబ్‌సైట్ ద్వారా పరిష్కరించేలా ఆన్‌లైన్ విధానాన్ని తీసుకువస్తానని భరోసా ఇచ్చారు. ఐదేళ్లలో ధరలు 200 నుంచి 300 శాతం పెరిగాయని, చాలీచాలని జీతాలతో బతికే ప్రైవేటు ఉపాధ్యాయులు ఎలా బతకాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఒక వర్గాన్ని బతికించడానికి జగన్ ప్రభుత్వం చిన్నవర్గాలను నలిపేస్తోందన్నారు. కార్యక్రమంలో తిలక్, శ్రీహరి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అనంతరం ఆయన నగరంలోని ఎల్‌వీఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కాటన్, స్పిన్నింగ్ మిల్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్నారు. సమస్యలపై తాను ఎంత దూరమైనా వెళ్లి పోరాడతానని వారికి ఆయన హామీ ఇచ్చారు. కాటన్, స్పిన్నింగ్ మిల్లుల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

సామాజికసేవలో యువత ముందుండాలి

గుంటూరు (విద్య), మార్చి 1: యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందు ఉండాలని వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డీ.రవిశంకరరెడ్డి అన్నారు. శుక్రవారం జేకేసీ ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 విద్యార్థులు అడవితక్కెల్లపాడు గ్రామంలో సేవా కార్యక్ర మాలను నిర్వహించారు. ఆకార్యక్రమాన్ని ఉద్దేశించి రవిశంకరరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలలో విద్యార్థులు పాల్గొనడం వలన సమాజంలో ప్రజల జీవన స్థితిగతులు తెలుస్తాయని, గ్రామాల సేవ- దేశ సేవని, అందరూ అంకితభావంతో గ్రామానికి సేవ చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఐ. నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు సిగ్గుచేటు

● కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా

గుంటూరు(తూర్పు), మార్చి1: పశ్చిమబెంగాల్, సందేశ్‌ఖాలీలో మహిళలపై జరుగుతున్న దాడులు సిగ్గుచేటుని, తక్షణమే ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్లో జరుగుతున్న మహిళలపై దాడులకు నిరసనగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా సరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ మహిళలకు రక్షణ ఇవ్వలేని ఈ మమతా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్ వేణుగోపాల రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో బీజేపీ నేతలు చంద్రశేఖర్, పాటిబండ్ల రామకృష్ణ, యడ్లపాటి స్వరూపారణి, పాండు రంగ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ప్రసూతి విభాగంలో

40 పడకలతో రెండు ఏసీ వార్డులు

గుంటూరు (మెడికల్) మార్చి 1: ప్రభుత్వాస్పత్రి ప్రసూతి విభాగంలో కొత్తగా 40 పడకలతో ఏసీ వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రసూతి విభాగంలో జరుగుతున్న వార్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో గైనకాలజీ విభాగంలో రెండు ప్రత్యేక ఏసీ వార్డులను, ఇందులో ఆధునిక పడకలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.70 లక్షల ప్రత్యేక నిధులతో ఈ వార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

తెలుగు మహిళ జిల్లా కమిటీ కార్యదర్శిగా వకుళాదేవి

గుంటూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పినపాల వెంకట వకుళాదేవి తెలుగు మహిళ జిల్లా కమిటీకి ఎంపికయింది. నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర సూచన మేరకు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ ఆమెను జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎంపిక చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మార్చి 1: విద్యుత్‌లైన్ల నిర్వహణలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ టి సుబ్బరాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాండురంగపురం, బాలాజీనగర్, మల్లికార్జునపేట, భారత్‌పేట, నగరాలు, వేళంగిణీనగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

డ్రెయిన్లకు దూరంగా తాగునీటి పైపు లైన్లు

● సీఎస్ వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్

గుంటూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో మురుగు నీటి కాలువల మీదుగా వెళ్లే తాగునీటి పైపులైన్లను పక్కకు మార్చటంతో పాటు, లీకులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసేలా కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డికి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ జవహర్ రెడ్డి, పురపాలకశాఖ అధికారులతో కలిసి పట్టణాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌తో పాటు జీఎంసీ కమిషనర్ కీర్తీ చేకూరి, వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో సరఫరా అవుతున్న తాగునీటిని పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు పరీక్షించి సరఫరా చేస్తున్నారన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, జీఎంసీ ఎస్ఈ సుందరరామిరెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. కిరణ్, ఆహార తనిఖీ అధికారి రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

విద్యా దీవెన నిధులు విడుదల

గుంటూరు సిటీ, మార్చి1 : విద్యా దీవెన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అక్టోబరు- డిసెంబరు-2023 త్రైమాసిక ఫీజు నిధులను విద్యార్థులు, తల్లుల జాయింట్ ఖాతాలో జమచేసే కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృష్ణా జిల్లా పామర్రు నిర్వహిచారు. ఆ సభ ప్రత్యక్షప్రసారాన్ని గుంటూరు కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయపరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సహాయక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, రాష్ట్ర కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కోలా భవానీ మణికంఠ, డీడీ సాంఘీక సంక్షేమశాఖ మధుసూధనరావు, విద్యార్థులతో కలసి వీక్షించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ.. గుంటూరు జిల్లాకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసి, ఈబీసీ, కాపు, ముస్లీం, క్రిస్టియన్ మైనారిటీలకు చెందిన 37,064 మంది లబ్ధిదారులకు 33,145 మంది తల్లుల ఖాతాలకు రూ. 31.28 కోట్ల జమచేయనున్నట్లు తెలిపారు. అనంతరం 2023 -2024 మొదటి త్రైమాసికాని సంబంధించి 37,064 మంది విద్యార్థులకు చెందిన రూ.31,28,08, 508 నగదు చెక్కును కలెక్టర్ అందజేశారు.

అంకుర పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

● ఆంధ్రావర్శిటీ వీసీ రవి ఈశ్వరపు

గుంటూరు(విద్య),మార్చి 1: స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన 'అంకుర పరిశ్రమల సదస్సు' నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచేచసిన ఆంధ్రా యూనివర్సిటీ వీసీ రవి ఈశ్వరరపు మాట్లాడుతూ.. అంకుర పరిశ్రమల స్థాపన, వాటిని విజయపథంలో నడపబడటానికి చేపట్టవలసిన చర్యలను, అందు లోని వివిధ దశలను ఆయన వివరించి, పరిశ్రమల్లో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించే సులభతర మార్గాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

● గృహ వినియోగ గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లలో నింపి అమ్మకం

● సంబంధిత వ్యక్తులపై 6-ఏ కేసు నమోదు చేయాలని ఆదేశం

గుంటూరు(తూర్పు), మార్చి1: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ సమీపంలో అక్రమంగా నిల్వచేసి, విక్రయిస్తున్న గ్యాస్ సిలిండర్లును విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పౌరసరఫరాల అధికారులతో కలసి విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. ప్రకాశం జిల్లా, తాళ్ళూరు మండలం, గంగవరంకు చెందిన పాదర్తి కుమార్ రాజా అనే వ్యక్తి ఇంటి వద్ద గృహ అవసరాలకు వినియోగించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లలోని గ్యాస్‌ను, కమర్షియల్ సిలిండర్లలోకి మార్చి పులుగు రామకృష్ణ, చిచ్చుల సుబ్బారావు సాయంతో హోటళ్లకు రూ.1650 విక్రయిస్తున్నట్టు కనుగొన్నారు. దీంతో అధికారులు నిల్వ ఉంచిన 24 ఫుల్, 32 ఖాళీ (మొత్తం 56) సిలిండర్లులను స్వాధీనం చేసుకున్నారు. సదరు నింధితులపై 6-ఏ కేసు నమోదు చేయాలని స్థానిక సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసిల్దార్‌ను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ అధికారి ఎస్ శ్రీనివాసులు రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



తాడిశెట్టి మురళికి సంఘీబావం తెలియజేస్తున్న కార్యకర్తలు

తాడిశెట్టి సోదరుల వెంటే మేము..

● మురళీని కలిసిన వైసీపీ శ్రేణులు.. పార్టీ వీడుతున్నట్లు వెల్లడి

గుంటూరు, మార్చి 1: అధికార వైసీపీకి చెందిన పప్పుల రవి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుపేట నుంచి పలువురు కార్యకర్తలు మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీమోహన్‌ను పట్టాభిపురంలోని ఆయన కార్యాలయంలో కలిశారు. 'మీవెంటే ముముంటాం అంటూ' వారు మురళీకి సంఘీబావం తెలియజేశారు. ఈసందర్భంగా వారంతా వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించారు. పార్టీలో కష్టించి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉండటం లేదని, అందుకే తాము కూడా తాడిశెట్టి సోదరుల వెంటే ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు షేక్ ముస్తఫా, సైదులు, మస్తాన్, షరీఫ్, జానీ, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిసాగు పంటలను కొనుగోలు చేస్తాం

● నెదర్లాండ్‌కి చెందిన వెర్టీజెన్ స్పైసిస్ ప్రతినిధులు

మంగళగిరి, మార్చి 1: ప్రకృతి వ్యవసాయంలో పండించిన అన్ని రకాల పంటలను కొనుగోలు చేస్తామని నెదర్లాండ్ దేశానికి చెందిన వెర్టీజెన్ స్పైసిస్ సంస్థ అధినేత మైఖేల్ డ్రెసేన్ అన్నారు. మంగళగిరి మండలంలోని రామచంద్రాపురం, నూతక్కి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం పంటలను శుక్రవారం వెర్టీజెన్ సంస్థ బృందం, గ్రోకామ్ సంస్థ ప్రతినిధి జార్జ్ కురియన్ బృందం పరిశీలించింది. రైతులు ఉషారాణి, కళ్లం శ్రీనివాసరెడ్డిల వ్యవసాయ క్షేత్రంలో అరటిలో వేసిన అంతర పంటలను పరిశీలించి, సాగు పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందానికి రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టీ.విజయ్‌కుమార్ నేతృత్వం వహించి వివిధ విషయాలను వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఓటు ఎంతో కీలకం

● తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ

దుగ్గిరాల,మార్చి 1: రాష్ట్రం దశ, దిశ మార్చేది అత్యంత విలువైన యువతీ, యువకుల ఓట్లేనని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రావి పాటి సాయికృష్ణ అన్నారు. శుక్రవారం చింతలపూడిలోని ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో టీడీపీ ఆధ్వర్యంలో 'ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సాయికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో మొదటసారి ఓటు వేసే యువత సుమారు 46లక్షల మంది ఉన్నారనీ, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే పార్టీని ఎన్నుకోవాల్సిన బాధ్యత వీరిపై ఉందన్నారు. కార్య క్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు జంగాల చైతన్య, మంగళగిరి నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు పడవల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని రైతులకిచ్చిన హామీలను నేరవేర్చాలి

తాడికొండ, మార్చి 1: రాజధాని అమరావతి ప్రాంత రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రైతులు, మహిళలు డిమాండ్ చేశారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండ గ్రామంలో రైతులు, మహిళలు శుక్రవారం నిరసనలు వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు గత ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేసి ఇవ్వాలని పేర్కొన్నారు. మూడు రాజధానుల ప్రకటనతో రాష్ట్రాన్ని నాశనం చేసిన సీఎం ఇప్పుడు రాజధాని భూములను తాకట్టుపెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. మూడు రాజధానుల ప్రకటనను వెనుకకు తీసుకునే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పసుపు రైతులకు అందని పరిహారం

● ప్రమాదం జరిగి 41 రోజులైనా స్పందన కరువు

● విచారణ పేరుతో కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు

● ధర్నాలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



రైతుల దీక్షలకు సంఘీబావం తెలుపుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తదితరులు

దుగ్గిరాల, మార్చి 1: దుగ్గిరాలలోని కోల్డ్‌స్టోరేజిలో అగ్నిప్రమాదం జరిగి 41 రోజులైనా రైతులకు పరిహారం అందించకుండా విచారణ పేరుతో కమిటీవేసి చేతులు దులుపుకున్నారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు అన్నారు. దుగ్గిరాల శుభంమహేశ్వరి కోల్డ్‌స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదంలో 1.16 లక్షల బస్తాల పసుపు నిల్వ పెట్టిన రైతులు నష్టపోయిన విషయం విదితమే. తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు ప్రారంభించిన దీక్షా శిబిరానికి శుక్రవారం ఎమ్మెల్సీ లక్ష్మణ రావు వచ్చి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదం జరిగిన నాటినుంచి నేటి వరకూ వ్యవసాయశాఖా మంత్రి, ప్రజా ప్రతినిధులు, బీమా కంపెనీల ప్రతినిధులు ఎవ్వరూ బాధిత రైతులను పట్టించుకోక పోవటం బాదాకరమన్నారు. ప్రభుత్వం విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి నిధులు విడుదల చేసి క్వింటాల్‌కు రూ.13వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. పసుపు రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారం అందించేవరకు పోరాటం చేస్తామన్నారు. కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి పీ.జమలయ్య, రైతుసంఘ జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ములకా సాంబిరెడ్డి, పసుపురైతుల కమిటీ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, సీపీఐ (ఎంఎల్) రాష్ట్రకార్యవర్గ సభ్యుడు భాస్కరరావు, కాజా వెంకటేశ్వర రావు, జెట్టి బాలరాజు, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, వల్లూరి భారతీదేవి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, బాధిత రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మంగళగిరి, మార్చి 1: విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా నవులూరు గ్రామంతోపాటు బాపూజీనగర్, ఉడాకాలనీ, శిబిరం ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తాగునీటి కోసం దొండపాడు దళితుల ఆందోళన

తుళ్ళూరు, మార్చి 1: పది రోజుల నుంచి మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో తాగు నీటి ఎద్దడి నెలకొంది. దీంతో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో గ్రామస్థులు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేశారు. రాబోయేది ఎండాకాలమని రాను రాను తాగు నీటి సమస్య ఝటిలం కాకముందే వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు వాటర్ ట్యాంకులుంటే పది రోజుల నుండి చుక్క తాగు నీరు కూడా లేదన్నారు. అధికారుల తీరును వారు ఎండగట్టారు.

మలినేనిలో సంస్కృతి-2024 వేడుకలు

వట్టిచెరుకూరు, మార్చి 1: మండలం పరిధి పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సంస్కృతి 2024 వేడుకలు శుక్రవారం తొలిరోజు అంబరాన్నింటాయి. జాతీయ స్థాయి టెక్నో, కల్చరల్ స్పోర్ట్స్‌లో పాల్గొనేందుకు సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్ఆర్ఐ వరల్డ్ ఎన్‌జీవో సీఈవో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, డాక్టర్ శ్రీరత్న, జెఎన్‌టియుకె డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ బీ.బాలకృష్ణ, ఎన్ఆర్ఐ అశోక్‌లు పాల్గొని విద్యార్థులకు దిశనిర్దేశం చేశారు. డాక్టర్ చంద్రశేఖర్ ఆయన భార్య డాక్టర్ శ్రీరత్న జ్యోతి ప్రజ్వలన చేసి టెక్నో, కల్చరల్, కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మలినేని విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ గోనుగుంట్ల రామస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు డీన్స్ అకాడెమిక్స్ డాక్టర్ రమేష్‌బాబు, కో కన్వీనర్స్ డాక్టర్ విజయసారధి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ సునీత, డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో వీఐటీలో

ఏపీ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు సమావేశం

తుళ్లూరు, మార్చి1: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు 6వ సమావేశం ఐనవోలు పరిధిలోని వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయంలో మార్చి 3, 4 తేదిలో సమావేశం అవుతుందిని వీఐటీ యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటలో పేర్కొంది. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని తెలిపింది. రాష్ట్రంలో ఇటువంటి సమావేశాన్ని నిర్వహించే గౌరవాన్ని పొందిన మొదటి ప్రైవేటు విశ్వవిద్యాలయంగా వీఐటీ నిలిచిందన్నారు. ప్లానింగ్ బోర్డు ఛైర్మెన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ఈ సమావేశాన్ని ప్రారంభిస్తారు. అనంతరం విఐటీ వైస్ ఛాన్సలర్ ఎస్వీ కోటా రెడ్డి తన సందేశాన్ని అందిస్తారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ప్రిన్సిపాల్ సెక్రటరి జె.శ్యామలరావు (ఐఎయస్) చీఫ్ కోఆర్డినేటర్ ఎపిసీటీఈ బుద్ధ చంద్రశేఖర్, విశిష్ట అతిథిగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వీఐటీ వైస్ ఛాన్సలర్ జీ.విశ్వనాధన్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

పేదల పక్షాన వైసీపీ ప్రభుత్వం పని చేస్తుంది

తుళ్లూరు మార్చి 1: పేదల పక్షాన వైసీపీ ప్రభుత్వం పని చేస్తుందని తాడికొండ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. శుక్రవారం రాజధాని అమరావతి జీవన భృతి(భూమిలేని నిరుపేదల) ఫింఛన్ పెంచిన ఐదు వేలను తుళ్లూరులోని అయ్యప్ప స్వామి కళ్యాణమండపం ఎదురుగా ఉన్న ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో సుచరిత పంపిణీ చేశారు. పలువు ల్యాండ్ లెస్ పూర్ లబ్ధ దారులకు సుచరిత చేతుల మీదగా రూ.5 వేలు ఫింఛన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానంద రెడ్డి, నేతలు పలువురు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో

ఎస్పీ తనిఖీలు

గుంటూరు, మార్చి 1: గుంటూరు వెస్ట్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో శుక్రవారం ఎస్పీ తుషార్ డూడీ తనిఖీలు చేశారు. అరండల్‌పేట, పట్టాభిపురం, నగరంపాలెంలో స్టేషన్లలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీల్లో ఎస్పీవెంట డీఎస్పీ మహేష్, సీఐలు వెంకటేశ్వర రెడ్డి, నరేష్, విజయ్ చంద్ర తదితరులు ఉన్నారు.



విద్యార్థులను తనిఖీచేసి పరీక్షకు అనుమతి ఇస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

● 14 కేంద్రాల్లో 2410 మంది హాజరు

తెనాలి అర్బన్, మార్చి 1: పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. 14 కేంద్రాల్లో మొదటి సంవత్సరం పరీక్షలకు 2410 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఉదయం 8గంటల నుంచే విద్యార్థులు చేరుకుని హాల్ టిక్కెట్ నెంబర్లు సరిచూసుకున్నారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో ఉదయమే పట్టణంలోని ఆలయాలను దర్శించి హాల్ టిక్కెట్, పరీక్ష ప్యాడ్, పెన్నులు స్వామి వారి ముంగిట ఉంచి పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పూజలు చేయించుకోవడం కనిపించింది. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి నెలకొంది.

● పొన్నూరు టౌన్: పట్టణంలో శుక్రవారం ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి. పొన్నూరు పట్టణంలోని బీపీఎన్ కళాశాల, సుజాతా జూనియర్ కళాశాల, వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం 8గంటల నుంచే పరీక్షల కేంద్రాలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 9గంటల లోపే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు తరలివెళ్లారు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శంకర్ నేత్రాలయ సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే శివకుమార్



ఎమ్మెల్యే శివకుమార్‌కు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు, పక్కన మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట మార్చి 1: పేదలకు శంకర్ నేత్రాలయ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణ పురపాలక సంఘ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం ఆంధ్ర పారీస్ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు శంకర కంటి ఆసుపత్రి, పెదకాకాని వారు పురపాలక సంఘ సిబ్బందికి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంటు కమిషనర్ అనూష, మేనేజర్ రామారావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అకురాతి రామచంద్రరావు, సెక్రటరీ టీఎం కల్యాణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు హుస్సేన్‌వలి, భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లను చెల్లించాలి

● సీఐటీయూ నాయకుడు హుస్సేన్‌వలి

తెనాలి, మారీసుపేట మార్చి 1: భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు హుస్సేన్‌వలి డిమాండ్ చేశారు. స్థానిక గాంధీచౌక్‌లో శుక్రవారం తెనాలి డివిజన్ భవన నిర్మాణ తాపీ వర్కర్స్ యూనియన్ మరియు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లు వెంటనే పరిష్కరించాలని పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు హుస్సేన్‌వలి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారానే అందించాలని, పథకాలకు అమలుకు ఆటంకంగా ఉన్న 1214 మెమోని వెంటనే రద్దుచేయాలని, వైఎస్‌ఆర్ బీమా పనిచేసే ప్రతి కార్మికునికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ అధ్యక్షుడు షేక్ ఫకీర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెరుగుతున్న సిమెంటు, ఐరన్ ధరలను తగ్గించి, ఇసుకను అందరికీ అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డిరౌతు శ్రీను, షేక్ బషీర్, దండా లక్ష్మీనారాయణ, కృష్ణ, కరిముల్లా, శంకర్, షేక్ జీని, కె.శేషగిరి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

● ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి, మారీసుపేట మార్చి 1: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణంలోని మునిపల్ కార్యాలయంలో శుక్రవారం పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బి శేషన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి సంబంధించి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని అందులో భాగంగా ఈ నెల 3వ తేదీన ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు ప్రతి ఒక్కరికి తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని, తద్వారా చిన్నారులు పోలియో బారినపడకుండా చూడవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కె.హెలెన్ నిర్మల, అసిస్టెంటు కమీషనర్ అనూష, మేనేజర్ అప్పలరాజు, ఆరోగ్య విస్తరణాధికారి బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, విజయకుమారి, కౌన్సిలర్ పి.సంజీవరెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు

తెనాలి, మారీసుపేట మార్చి 1: పట్టణంలో పేదప్రజల కోసం తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా పార్లమెంటరీ నాయకుడు డాకర్ పెమ్మసాని చంద్రశేఖర్ సౌజన్యంతో స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజిచౌక్‌లో అన్న క్యాంటీన్‌లలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, ముళ్ళపూడి వెంకట్, గోగినేని రమేష్, మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ళ శివప్రసాద్, వెల్లంకి సాంబయ్య, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసమే టీడీపీ,జనసేన పొత్తు

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న మార్కండేయబాబు, జనసేన నాయకులు

పొన్నూరు టౌన్, మార్చి 1: రాష్ట్రాభివృద్ధి కోసమే తెలుగుదేశం పార్టీ జనసేన పొత్తు లక్ష్యం అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేసిన నరేంద్ర కుమార్‌కు ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బాణా సంచా పేల్చి ర్యాలీగా కార్యాలయంలోకి తీసుకువెళ్లారు. నరేంద్రకుమార్‌ను గజమాలలతో సత్కరించి పట్టణ, గ్రామస్థాయిలో జనసేన నాయకులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వడ్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి నరేంద్ర కుమార్ గెలుపు కోసం జనసేన నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాక్షసపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి పవన్ కళ్యాణ్ చంద్రబాబు కలిసి పనిచేస్తున్నారన్నారు. రాబోయే రోజులో గ్రామస్థాయి నుంచి టీడీపీ, జనసేన కలిసి పని చేసే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలపై వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినప్పటికి ధూళిపాళ్ళ నరేంద్రదే విజయం అన్నారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఇరు పార్టీలు కలిసి ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా హాజరైన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసకర దోపిడీ పాలన అంతం చేయటానికి పవన్ కళ్యాణ్ చంద్రబాబు ముమ్మడి కార్యచరణ రూపొందించినట్లు చెప్పారు. పొత్తును గ్రామస్థాయికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. పొత్తు ఈ ఎన్నికల వరకే కాకుండా భవిష్యత్తులోనూ జరిగే ఎన్నికలో కూడా కొనసాగించనున్నట్లు చెప్పారు. రాబోయే పంచాయతీ ఎన్నికలతోపాటు, ప్రతి ఎన్నికలోనూ ఉమ్మడిగా పోరాటం చేసి ప్రతిచోట టీడీపీ, జనసేన అభ్యర్థులు గెలిచేలా పనిచేయనున్నట్లు చెప్పారు. కొంతమంది మంత్రులు పవన్‌కల్యాణ్, చంద్రబాబుపై అవమానకర వ్యాఖ్యలు చేయటానికి మాత్రమే పరిమితమయ్యారని ఆరోపించారు. వ్యక్తిగత విమర్శల పేరుతో అసభ్యకరమైన పదజాలాన్ని తమ నాయకులపై చేస్తున్నారని, దీనిని సహించబోమని హెచ్చరించారు. ఇలాంటి వారికి రాబోయే రోజులో తగు రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వైసీపీని భూస్థాపితం చేయటమే టీడీపీ, జనసేన పంతం అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లూరి అప్పారావు, దేశంశెట్టి సూర్య, మళ్లిబోయిన గోపీకృష్ణ, చేబ్రోలు పున్నారావు, యన్నం నాయుడు, పింగంశెట్టి శంకర్, మిరియాల చంద్రకాంత్, ఆకుల గోపి, తోట నాగరాజు, ఆదేళ్ల వాసంతి, ఆకుల సాయిలీలా, ఆవుల గోపి, కట్టా నాగరాజు, రాయుడు, చెందు, గరికపాటి చిన్నారి, శివ కోటేశ్వరరావు తదితర నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ముందుకు సాగుదాం..

● ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందాం

● పెమ్మసానిని, మనోహర్‌ను గెలిపించే బాధ్యత మనదే

● టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో మాజీమంత్రి ఆలపాటి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని, నాదెండ్ల

తెనాలి రూరల్, మార్చి 1: రాష్ట్ర భవిష్యత్తును దృషిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా ముందుకు సాగుదామని మాజీమంత్రి, తెనాలి నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరీ స్థాయి నాయకుడు పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ, జనసేన ఇరుపార్టీల శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనకు చరమగీతం పాడే రోజు అతి త్వరలోనే ఉందన్నారు. ఇరు పార్టీల శ్రేణులు ఐకమత్యంగా ఉంటూ భవిష్యత్తుకు గ్యారెంటీ సంక్షేమ పథకాలను ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. ఎన్నికలకు సమయం అతి తక్కువ ఉందని ఇరుపార్టీల శ్రేణులు ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గుంటూరు పార్లమెంట్ పరిధిలో 468 గ్రామాలున్నాయని 45 రోజుల ఎన్నికల ప్రచారంలో భాగంగా తెనాలి నియోజవర్గంలో ఐదు రోజులు పర్యటించనున్నారని తెలిపారు. ఆయన ప్రచార సమయంలో ఇరుపార్టీల శ్రేణులు ముందుండి నడపాలన్నారు.

టీడీపీ పార్లమెంటరీ స్థాయి నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అమరావతి రాజధానిగా చంద్రబాబు హయాంలో పనులు వేగవంతంగా జరుగుతున్న సమయంలో అధికారం మారడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్రంలో రాజధాని ఎక్కడా అంటే స్పష్టంగా చెప్పలేని పరిస్థితికి ప్రజలను దిగజార్చారని అన్నారు. వైసీపీ మోసపూరిత పాలనను ప్రజలకు తెలిపి చైతన్యవంతులను చేస్తూ టీడీపీ, జనసేన అధికారం చేపట్టిన వెంటనే అందించే సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రజల్లో వైసీపీ పట్ల వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను దిగజార్చి వైసీపీ పెద్దలు మాత్రం కుబేరులుగా మారారని ఆరోపించారు. రాష్ట్రంలో దాడులు, గంజాయి, అక్రమ మద్యం, ఇసుక, మట్టి మాఫియాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. టీడీపీ, జనసేన శ్రేణులు ఐకమత్యంగా ఉంటూ ప్రచారం సాగించాలన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరులో కాదు నిజంగానే రారాజంటూ ఆయనను ప్రసంశించారు. పార్టీ కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆలపాటితో కలిసి ఎన్నికల్లో ముందుకు సాగుతానని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఇరు పార్టీల శ్రేణులకు తాను అందుబాటులో ఉంటూ వారికి చేదోడువాదోడుగా నిలుస్తానని తనపై ఎటువంటి అపోహలు రానివ్వవద్దని పార్టీల శ్రేణులకు సూచించారు.

బెస్ట్ బ్లడ్ డోనర్స్ క్యాంపు ఆర్గనైజర్‌గా నాగరాజు



సర్టిఫికెట్‌ను నాగరాజుకు అందిస్తున్న డాక్టర్ సౌభాగ్యవాణి

తెనాలి, మారీసుపేట మార్చి 1: స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం బెస్ట్ బ్లడ్ డోనర్స్ క్యాంపు ఆర్గనైజర్‌గా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజుకు సర్టిఫికెట్‌ను ప్రభుత్వ జిల్లా వైద్యశాల తరుపున జిల్లా వైద్యశాల సూపరింటెండెంటు డాక్టర్ సౌభాగ్యవాణి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యశాలలో రక్త నిల్వలు అవసరమైన యువతకు పిలుపునివ్వడం జరిగిందని, దానికి స్పందించి కోస్తాంధ్ర అధ్యక్షుడు నాగరాజు తమ సభ్యులు 40 మందితో రక్తదానం చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజుని అభినందించి, చేసిన సేవకు మా వైద్యశాల తరుపున బెస్ట్ బ్లడ్ డోనర్స్ క్యాంపు ఆర్గనైజర్ సర్టిఫికెట్‌ను అందజేశామని తెలిపారు. నాగరాజు మాట్లాడుతూ యువత ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఆర్ సందీప్, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ ఎం.బాపయ్య వైద్య సిబ్బంది, హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

● మండల వ్యవసాయాధికారి వెంకట్రావు



కొల్లిపరలో జొన్న పైరును పరిశీలిస్తున్న ఏవో వెంకట్రావు

కొల్లిపర, మార్చి 1: జొన్న, మొక్కజొన్న సాగుచేసిన రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించడానికి వీలుకలుగుతుందని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చివలూరు, కొల్లిపర, వల్లభాపురం, దావులూరు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి మొక్కజొన్న, జొన్న పంటలను పరిశీలించారు. రైతులకు ఎరువులు వేయవలసిన పద్ధతి గురించి, తెగుళ్ల ఆశించినట్లయితే అయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో జొన్నపైరు 55 నుంచి 60 రోజులు వయసులో ఉందని అక్కడక్కడ పేనుబంక కనిపిస్తుందన్నారు. దాని నివారణకు ఎకరానికి 100 నుంచి 150 గ్రాములు ఎసీటమాప్రిడ్ అను పురుగు మందును 150 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా అనంతాచార్యులు

తెనాలి అర్బన్, మార్చి 1: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన టి.అనంతాచార్యులు నియమితులయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర ధార్మిక విభాగం కన్వీనర్‌గా రెండుసార్లు, కార్యవర్గ సభ్యుడిగా కూడా ఆయన పార్టీకి సేవలు అందించారు. ఈ పదవికి తనను ఎంపిక చేయడంపై జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బీజేపీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు కృషి చేస్తామన్నారు. పలువురు పార్టీ నాయకులు ఆయనను అభినందించారు.



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, మున్సిపల్ అధికారులు

వ్యర్థాలను కాల్వల్లో వేయవద్దు

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట మార్చి 1: పట్టణ ప్రజలు వ్యర్థాలను కాల్వల్లో వేయరాదని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణంలోని రెండో వార్డు ఫైయిర్‌పేటలో శుక్రవారం శానిటేషన్ పనులను పరిశీలించి అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ సుందరీకరణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యర్థాలను మురుగు కాల్వలో వేయరాదని, వేయటంవలన సిల్ట్ పేరుకొని మురుగు నీటిపారుదల ఆగుతుందని దోమలు పెరిగి అనారోగ్యానికి గురవుతారని అన్నారు. కాల్వలపై ఆక్రమలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

తెనాలి రూరల్, మార్చి 1: అనారోగ్యంతో బాధపడుతూ వైద్యఖర్చులు భరించాలని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందించి ఆదుకున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ముగ్గురు బాధితులకు రూ.10లక్షల 30వేలు విలువ గలిగిన చెక్కులను ఎమ్మెల్యే శివకుమార్ అందించారు. పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



వెబ్ సిరీస్ సన్నివేశాలకు క్లాప్ కొడుతున్న రత్నాకర్

నాజరుపేటలో అహనా పెళ్లంట వెబ్‌సిరీస్ చిత్రీకరణ

తెనాలి అర్బన్, మార్చి 1: పట్టణంలోని నాజరుపేటలో అహనా పెళ్లంట వెబ్‌సిరీస్ చిత్రీకరణ సన్నివేశాలకు శుక్రవారం దర్శకుడు కె.రత్నాకర్ క్లాప్ కొట్టారు. శ్రీశ్రీ మీడియా బ్యానర్‌పై మునిపల్లి శ్రీకాంత్ నిర్మాతగా సిరీస్‌ను చిత్రీకరిస్తున్నారు. ప్రేమ, వినోదంతో కూడిన సిరీస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. హీరోయిన్ రేఖ, హీరో కళ్యాణ్ శివలపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. దోనేపూడి వెంకి రావణ్, శేఖర్, అరుణ్, ముఖేష్, రాజు, రమేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ప్రసూతి విభాగంలో రెండు ఏసీ వార్డులు

గుంటూరు (మెడికల్) మార్చి 1: ప్రభుత్వాస్పత్రి ప్రసూతి విభాగంలో కొత్తగా 40 పడకలతో ఏసీ వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రసూతి విభాగంలో జరుగుతున్న వార్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో గైనకాలజీ విభాగంలో రెండు ప్రత్యేక ఏసీ వార్డులను, రూ.70 లక్షల ప్రత్యేక నిధులతో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.



టీడీపీలో చేరిన పచ్చలతాడిపర్రు వైసీపీ నాయకులు

వైసీపీ వీడ్కోలుకు ప్రజలు సిద్ధం: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, మార్చి 1: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి వీడ్కోలు పలికేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధం అయ్యారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం టీడీపీలో చేరారు. చింతలపూడి నరేంద్రకుమార్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నాయకులు దున్నా కిరణ్, బుల్లా ఎలీషా, అత్తోట వీరస్వామి, ఆరెమండ ప్రభువులు, పోలిమెట్ల సోనీ, ఆరెమండ రమేష్, పొన్నగంటి సంజయ్ తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు, కొచర్ల బెనర్జీ, యలవర్తి శేషగిరిరావు, ఆరెమండ విజయ్‌కుమార్, పొలకానీ సూర్యబాబు, కొండమూడి సుధాకరరావు, యంపరాల గోపికృష్ణ, చిలకా రవి, ఆరెమండ రామోహనరావు, చిలకా విజయ్, తాడికొండ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వామపక్షవాది లగడపాటి

చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన వామపక్షవాది లగడపాటి వేణుగోపాల్ శుక్రవారం టీడీపీలో చేరారు. నారాకోడూరుకు చెందిన వేణుగోపాల్ అనేక ఉద్యమాలో పాల్గొని రైతులు, కౌలు రైతుల సమస్యలపై పోరాటం చేశారు. గొడవర్రు గ్రామంలో ఎస్సీ శ్మశాన వాటికకు సొంత స్థలాన్ని దానంగా ఇచ్చారు. వేణుగోపాల్ల నరేంద్రకుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు.

పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేయండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట మార్చి 1: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేయండని పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న అధికారులకు ఆదేశాలిచ్చారు. శుక్రవారం రానున్న సార్వత్రిక ఎన్నికల విధులలో భాగంగా పట్టణ మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న పట్టణంలోని 24వ వార్డు నుంచి 31వ వార్డులోని పోలింగ్ కేంద్రాలలో, ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాల 52నుంచి 57 పోలింగ్ కేంద్రాలలో, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల 54, 55 కేంద్రాలలో, శబరి వృద్ధాలయం 58, 58, ముస్లిం ప్రాథమిక పాఠశాల 97, 98, మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ 99, 100, 102, 103 వరకు గల పోలింగ్ కేంద్రాలలోని మౌలిక వసతులు అనగా తాగునీరు, విద్యుత్ దీపాలు, ఫ్యానులు, ర్యాంపులు, టాయిలెట్లు వగైరా పరిశీలించి తగు చర్యలు తీసుకోవలసినదిగా సూచనలు చేశారు. అనంతరం సామాజిక భద్రత పింఛనలు పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీ-2, టీపీఎస్ అసిస్టెంటు ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, శానిటరీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వధువుకు పెండ్లికానుకను అందిస్తున్న పార్టీ శ్రేణులు

ఆలపాటి పెండ్లి కానుక అందజేత

తెనాలి రూరల్, మార్చి 1: మండలంలోని పలువురికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పెళ్లికానుకలను అందజేశారు. మండలంలోని జగ్గడిగుంటపాలెం, ప్రగడ కోటయ్య నగర్‌కు చెందిన చేబ్రోలు శ్రీనివాసరావు, లక్ష్మి దంపతుల కుమార్తె అనూష, కొల్లిపర మండలం గుదిబండివారి పాలెంకు చెందిన ఘంటసాల అర్జునరావు, రమాదేవి దంపతుల కుమార్తె హేమలత, పట్టణంలోని 28వ వార్డుకు చెందిన షేక్ సుభాని, నర్జహాన్ దంపతులు కుమార్తె రిహాన వివాహాలను పురస్కరించుకుని ఆలపాటి పెండ్లికానుకగా మంగళసూత్రం, చీర, పసుపు, కుంకుమ, గాజులను పార్టీ శ్రేణులు ద్వారా అందించి ఆశీర్వదించారు.

పింఛన్లతో అండగా నిలుస్తున్న ఆలపాటి



ఆలపాటి పింఛన్ కానుకను అందిస్తున్న టీడీపీ శ్రేణులు

తెనాలి, రూరల్ మార్చి 1: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నియోజవర్గంలో తిరిగే క్రమంలో పలువురు తమకు ప్రభుత్వం ద్వారా పింఛన్ అందడంలేదని ఎన్నిసార్లు అర్జీలు అందచేసినా ప్రయోజనం లేదని ఆలపాటి ఎదుట పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం ద్వారా పింఛన్ మంజూరు అయ్యేంత వరకూ తాను అండగా ఉంటానని హామీ ఇచ్చి దాదాపుగా ఆరు నెలల నుంచి ఆయన ఇచ్చిన హామీ మేరకు ప్రతినెల ఒకటవ తేదీన ఆలపాటి పింఛన్ కానుక ద్వారా పింఛన్ సొమ్మును అర్థిదారులకు అందిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం నియోజవర్గంలోని లబ్ధిదారులు 32మందికి దాదాపుగా రూ.70వేలు పార్టీ శ్రేణులు చేతులమీదుగా అందించారు. పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఈ క్రాప్ ముసాయిదా జాబితాల ప్రదర్శన

పొన్నూరు టౌన్, మార్చి 1: సామాజిక తనిఖీలలో భాగంగా అన్ని రైతు భరోసా కేంద్రాలో ఈ నెల 3వ తేదీ నుంచి ఈ క్రాప్ ముసాయిదా జాబితాలను ప్రదర్శిస్తున్నట్లు పొన్నూరు ఏడీఏ వి.రామకోటేశ్వరి శుక్రవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాలలో గ్రామసభలు నిర్వహించి వివరాలను తనిఖీ చేయటంతోపాటు, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు చెప్పారు. రబీ సీజన్‌లో పొన్నూరు, చేబ్రోలు, కాకుమాను మండలాలో 44,972 ఎకరాలో సాగైన పంటల వివరాలను రైతుల వివరాలను ఈ జాబితాలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. రైతులు గ్రామ సభలకు హాజరై ప్రదర్శించిన జాబితాలను పరిశీలించటంతోపాటు అభ్యంతరాలను తెలపాలని ఏడీఏ సూచించారు.

రేపు మహిళలకు వంటల పోటీలు

తెనాలి రూరల్, మార్చి 1: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రెయిన్‌బో ట్రస్ట్, రోటరీ క్లబ్ తెనాలి ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్యకరమైన ఆహారంపై వంటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కొత్తపేట ఎన్‌జీవోస్ కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి మహిళలకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రైజ్ మనీ అందించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మహిళలకు చిరుసన్మాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

13న డాక్ అదాలత్

తెనాలి, మారీసుపేట మార్చి 1: స్థానిక కొత్తపేటలోని పోస్టల్ సూపరిండెంటు కార్యలయంలో శుక్రవారం పోస్టల్ రీజనల్ ఆఫీసు, విజయవాడ రీజియన్ కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన ఉదయం 11 గంటలకు డాక్ అదాలత్‌ను నిర్వహిస్తారని తెనాలి పోస్టల్ సూపరిండెంటు శొంతి రవికిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలు పొందటంలో ఏమైనా ఫిర్యాదులు ఉన్నవారు మార్చి 13, 2024వ తేదీన పోస్ట్ మాస్టర్ జనరల్ విజయవాడ రీజియన్, విజయవాడ వారి కార్యాలయంలో సంప్రదించవలసినదిగా కోరుతున్నారు. హాజరు కాలేనివారు మార్చి 7, 2024వ తేదీలోపు తమ ఫిర్యాదులను లెటర్ ద్వారా అసిస్టెంటు డైరెక్టర్ (స్టాఫ్), పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విజయవాడ రీజియన్, విజయవాడ - 520 003 కి పంపాలని కోరారు.